సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం ౹ 13 ౹ మార్చి ౹ 2023



ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 15 నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జోన్-1, 2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద తెలిపారు. - 8లో



ఉత్సాహంగా ఎడ్ల పరుగు పందేలు

నువ్వా నేనా అంటూ గెలుపే లక్ష్యంగా గొల్లప్రోలు మండలం కొడవలిలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందేలు ఉత్కంఠ భరింతగా జరిగాయి. - 8లో

డెల్టాలకు 7,160 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 7,160 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,580 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 5.55 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ప్రాచీన ఆలయాలను దర్శించిన జస్టిస్ జ్యోతిర్మయి



శ్రీలక్ష్మీ గణపతి స్వామి సన్నిధిలో జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు

బిక్కవోలు: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకట జ్యోతిర్మయి, ప్రతాప్ దంపతులు ఆదివారం బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను సందర్శించారు. తొలుత శ్రీలక్ష్మీ గణపతి ఆలయానికి వచ్చిన వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి వారు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు శ్రీ గోలింగేశ్వరస్వామి, శ్రీ కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామలింగ భాస్కర్, శ్రీలక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మినేని నాగశ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై పి.బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా డానియేల్ బాబు



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎస్టీయూ జిల్లా శాఖ నూతన అధ్యక్షుడిగా డానియేల్ బాబు ఎన్నికయ్యారు. ఆయన గోకవరం మండలం కామరాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్నారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.

ఊరంతా పండగ



కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేస్తున్న హోంమంత్రి తానేటి వనిత



రాజమహేంద్రవరంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

- జిల్లావ్యాప్తంగా ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు
- పాల్గొన్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు
- కేక్ కట్ చేసి సంబరాలు
- వాడవాడలా వైఎస్సార్‌కు నివాళులు



రాజానగరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తదితరులు

సాక్షి, రాజమహేంద్రవరం: పేదల గుండె చప్పుడుగా.. అణగారిన ప్రజలందరికీ అండగా.. పుష్కర కాలం కిందట ఆవిర్భవించిన వైఎస్సార్ సీపీ 13వ వసంతంలోకి అడుగు పెట్టింది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వాడవాడలా వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడింది. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 'జై జగన్.. జోహార్ వైఎస్సార్' అంటూ నినదించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పడిన కష్టాలను, ఎదుర్కొన్న ఒడుదొడుకులను గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ జనరంజక పాలన అందించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇదే రీతిలో పరిపాలన కొనసాగాలని ఆకాంక్షించారు.

- హోంమంత్రి తానేటి వనిత, పార్టీ నేతలు కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు; వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు.
- రాజమహేంద్రవరం సిటీ మార్గాని ఎస్టేట్‌లో పార్టీ శ్రేణులు, అభిమానుల ఆధ్వర్యాన ఎంపీ మార్గాని భరత్‌రామ్ భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. పార్టీ ఆవిర్భావం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను వివరించారు. రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ఆధ్వర్యాన కూడా వేడుకలు నిర్వహించారు.
- రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేటలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు ఆధ్వర్యాన వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచి పెట్టారు.
- రాజానగరం వైఎస్సార్ జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. తాము వైఎస్ జగన్ వెంటే నడుస్తామని పునరుద్ఘాటించారు.
- నిడదవోలు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు.
- గోపాలపురంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యాన వేడుకలు జరిగాయి. పార్టీ జెండాను ఆవిష్కరించారు.
- అనపర్తి కెనాల్ రోడ్డులోని దివంగత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు.
- జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు కోలాహలంగా నిర్వహించాయి.

రైల్వే స్టేషన్‌లో త్వరలో 6వ నంబర్ ప్లాట్‌ఫాం

ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు దక్షిణ మధ్య రైల్వే సన్నాహాలు చేస్తోంది. వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆదివారం మీడియాకు ఈ విషయం తెలిపారు. ప్రస్తుతం 4, 5 ప్లాట్‌ఫాంల పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రానున్న మరో రెండు వారాల్లో తూర్పు రైల్వే స్టేషను వైపు ఆరో నంబర్ ప్లాట్‌ఫాం కూడా రాబోతోందని చెప్పారు. గౌతమీ, గోదావరి వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ ప్లాట్‌ఫాం పైకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో ఇంకా ఏమేం కావాలో, ప్రయాణికుల డిమాండ్లు ఏమిటో తెలుసుకుని, అందుకు తగినట్టు చర్యలు చేపడతామని ఎంపీ భరత్ తెలిపారు.

కలెక్టరేట్‌లో నేడు స్పందన

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): స్పందన కార్యక్రమం సోమవారం యథావిధిగా కలెక్టరేట్‌లో జరుగుతుంది. కలెక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అర్జీదారుల సౌకర్యార్థం ప్రతి వారం మాదిరిగానే ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్‌కు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఉచిత బస్సు నడుస్తుందని పేర్కొన్నారు.

కోటసత్తెమ్మ తల్లికి రూ.1.81 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.1,80,882 ఆదాయం సమకూరింది. దేవస్థానం ఆధ్వర్యాన అమ్మవారికి ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేసి, పూజలు నిర్వహించామని ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఏప్రిల్ 6న జాతి నేతల విగ్రహాల ఆవిష్కరణ

- 100 అడుగుల మేర ఏర్పాటు
- వివేకానంద జంక్షన్ రహదారికి దండి మార్చ్ స్ఫూర్తితో పేరును సూచించాలి
- ప్రజలకు ఎంపీ, కలెక్టర్ విజ్ఞప్తి



గాంధీజీ విగ్రహావిష్కరణలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్ కుమార్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: జాతిపిత మహాత్మా గాంధీ దండి మార్చ్ స్ఫూర్తిని భావితరాలకు అందించడమే లక్ష్యంగా నగరంలో వంద అడుగుల మేర జాతి నేతల విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ కె.మాధవీలత, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. కంబాలచెరువు వివేకానంద జంక్షన్‌లో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించారు. శాంతికి చిహ్నంగా పావురాలను, బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ మార్చి 12 నుంచి ఏప్రిల్ 5 వరకూ దండి మార్చ్ నిర్వహించి, ప్రజల్లో జాతీయతా భావాన్ని రగుల్కొలిపారని గుర్తు చేశారు. నాడు స్వాతంత్ర్య సమర యోధులు చేసిన త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛ అనుభవిస్తున్నామని చెప్పారు. వారిని స్మరించుకుంటూ, వారి త్యాగాల నుంచి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారిని జ్ఞప్తికి తెచ్చే ప్రయత్నంలో భాగంగానే 11 మంది జాతి నేతల విగ్రహాలను కలెక్టర్, కమిషనర్ ఆలోచనల మేరకు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. 24 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టి, ఏప్రిల్ 6న విగ్రహాలను ఆవిష్కరిస్తారని ఎంపీ తెలిపారు.

కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే రోడ్ల అభివృద్ధి, ప్రధాన రహదారులను ఎండ్ టూ ఎండ్ నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. గోదావరీ నదీతీరాన్ని సుందరీకరిస్తామన్నారు. వివేకానంద జంక్షన్ ప్రధాన రహదారికి దండి మార్చ్ స్ఫూర్తిని అందించే పేరును ప్రతిపాదించాలని, ఏప్రిల్ 6న జరిగే విగ్రహావిష్కరణలో ఆ పేరు ప్రకటిస్తామని తెలిపారు. కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యోమంలో భాగంగా మహాత్మాగాంధీ రాజమహేంద్రవరానికి ఐదుసార్లు వచ్చారని, ఈ నగరంతో ఆయనకున్న అనుభందం ప్రత్యేకమైనదని అన్నారు. ఏప్రిల్ 6న సుమారు 100 అడుగుల మేర జాతి నేతల విగ్రహాలను ఆవిష్కరిస్తామని తెలిపారు. కార్యకమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నందనవనంలా తీర్చిదిద్దాలి

- ఏప్రిల్ 10 నాటికి కంబాల చెరువు సిద్ధం కావాలి
- అత్యవసర పనులు వెంటనే పూర్తి చేయాలి
- అధికారులకు కలెక్టర్ మాధవీలత ఆదేశం



కంబాలచెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని కంబాల చెరువు పార్కును నందనవనంలా తీర్చిదిద్దాలని కలెక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు, సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచే పర్యాటక కేంద్రంగా కంబాల చెరువు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కంబాల చెరువు అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్‌తో కలిసి ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాజమహేంద్రవరం నగరం నడిబొడ్డున ఉన్న కంబాల చెరువు పార్కుకు అధిక సంఖ్యలో ప్రజలు వాకింగ్‌కి వస్తారన్నారు. వీరందరికీ ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో ప్రజలు ఎక్కువగా ఈ పార్కుకు వస్తారని, ఈ దృష్ట్యా పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఏప్రిల్ 10వ తేదీ నాటికి అందుబాటులో తీసుకు రావాలని అన్నారు. వర్షపు నీరు, ఇతర మురుగు నీరు ఈ చెరువులో కలవకుండా మళ్లించే డ్రైన్ నిర్మాణ పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు. ప్రస్తుతం చెరువులో ఉన్న నీటిని శుభ్రపరచి, కుటుంబ సమేతంగా వచ్చే ప్రజలకు, పిల్లలకు ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. కంబాల చెరువు పార్కును అన్ని రకాల హంగులతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఆర్ట్స్ కళాశాల సమీపాన ఏర్పాటు చేసినట్టుగానే నగరంలోని మరో మూడు ప్రాంతాల్లో కూడా త్వరలో ఈట్ స్ట్రీట్‌లు ప్రారంభిస్తామని కలెక్టర్ మాధవీలత చెప్పారు. కంబాల చెరువు మధ్యన ఏర్పాటు చేస్తున్న కేబుల్ బ్రిడ్జి పనుల పురోగతిపై కమిషనర్ దినేష్ కుమార్ సమీక్షించారు. ఈ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ జి.పాండురంగారావు, ఈఈ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఉదయం 8 నుంచి 4 గంటల వరకూ పోలింగ్
- కొవ్వూరులో 144 సెక్షన్ అమలు
- బందోబస్తుకు 244 మంది పోలీసులు



కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

కొవ్వూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రెండు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం ఎన్నిక జరగనుంది. దీనికి కొవ్వూరు డివిజన్‌లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాల పునర్విభజనకు ముందు కొవ్వూరు డివిజన్ అవిభక్త పశ్చిమ గోదావరి జిల్లాలో ఉండేది. విభజన అనంతరం రాజమహేంద్రవరం కేంద్రంగా ఆవిర్భవించిన తూర్పు గోదావరి జిల్లాలో విలీనమైంది. అయితే శాసన మండలి స్థానిక సంస్థల నియోజకవర్గం మాత్రం పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోనే ఉంది. దీంతో కొవ్వూరు డివిజన్‌లో ఈ ఎన్నిక జరుగుతోంది. డివిజన్‌లోని తొమ్మిది మండలాల పరిధిలో ఉన్న 242 మంది ఓటర్లు కొవ్వూరులో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. వీరికోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు.

ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి కవురు శ్రీనివాస్, రవీంద్రనాథ్ వంకా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా గోరింక దాసు, చంద్రశేఖర్ వీరవల్లి, దేవరపల్లి ఆదాము, పసల వెంకటాచలం పోటీలో ఉన్నారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. పోలింగ్ నిర్వహణకు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ హోదాలో ఉన్న నలుగురు అధికారులను నియమించామని సహాయ ఎన్నికల అధికారి, కొవ్వూరు ఆర్డీఓ ఎస్.మల్లిబాబు తెలిపారు. మొత్తం 242 మంది ఓటర్లలో నల్లజర్ల మండలానికి చెందిన ఒక ఎంపీటీసీ సభ్యులు దుబాయ్‌లో ఉన్నారని, మిగిలిన వారికి స్థానిక సంస్థల ద్వారా గుర్తింపు కార్డులు అందజేశామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో కొవ్వూరు పట్టణంలో 144 సెక్షన్ విధించామని చెప్పారు. పోలింగ్ కేంద్రం నుంచి 100 మీటర్ల వరకూ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. అగ్గిపెట్టె, వాటర్ బాటిళ్లు, సెల్‌ఫోన్, బ్యాగ్‌లను, పోలీసులను, గన్‌మెన్‌ను పోలింగ్ కేంద్రం లోపలికి అనుమతించబోమని స్పష్టం చేశారు. బందోబస్తుకు 244 మంది పోలీసు సిబ్బందిని వినియోగించనున్నట్టు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపారు.

రత్నగిరి చేరిన కంచి పీఠాధిపతి



స్వామీజీకి నమస్కరిస్తున్న ఇన్‌చార్జి ఈఓ అజాద్

అన్నవరం: కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆదివారం రాత్రి రత్నగిరికి చేరుకున్నారు. ఆయనకు రత్నగిరి టోల్‌గేట్ వద్ద దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్, వేద పండితులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. సోమవారం ఉదయం స్వామీజీ సత్యదేవుని దర్శించి, ప్రత్యేక పూజలు చేస్తారు. స్వామీజీ ఈ నెల 18 వరకూ దేవస్థానంలో బస చేస్తారు. పీఠం సంప్రదాయాన్ని అనుసరించి కొండ దిగువన పంపా సత్రంలో ప్రతి రోజూ ఉదయం చంద్రమౌళీశ్వరునికి అభిషేకాలు, మహాత్రిపురసుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం చంద్రమౌళీశ్వరార్చన నిర్వహిస్తారు. పూజల అనంతరం భక్తులకు స్వామీజీ దర్శనమిస్తారు.

రహదారిపై రయ్‌రయ్..

- చకచకా రాజమహేంద్రవరం - విజయనగరం హైవే పనులు
- జిల్లాలో రూ.40 కోట్లతో రోడ్డు నిర్మాణం
- తీరనున్న ప్రయాణ కష్టాలు

సాక్షి, రాజమహేంద్రవరం/మధురపూడి: రాజమహేంద్రవరం నగరాన్ని ఏజెన్సీ మీదుగా విజయనగరంతో అనుసంధానం చేసే 516-ఇ జాతీయ రహదారిపై ప్రయాణం ఇక హాయిగా సాగనుంది. నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈ రోడ్డుకు రాష్ట్రీయ రహదారి (స్టేట్ హైవే) హోదా కల్పించారు. ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఈ రోడ్డుకు 516-ఇ జాతీయ రహదారిగా హోదా లభించింది. రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం సమీపంలోని ఐ.పోలవరం, కాకరపాడు జంక్షన్ (కొయ్యూరు), చింతపల్లి, లంబసింగి, జి.మాడుగుల, పాడేరు, అరకు, తాడిపూడి మీదుగా విజయనగరం వరకూ ఈ రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ రోడ్డులో అత్యధిక భాగం ఏజెన్సీ ప్రాంతం మీదుగానే సాగుతుంది.

తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాలను ఈ రోడ్డు అనుసంధానం చేస్తుంది. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు వద్ద ఉన్న ఫోర్ లేన్ బ్రిడ్జి నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా ఐ.పోలవరం వరకూ 43.7 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. ఐ.పోలవరం నుంచి కాకరపాడు జంక్షన్ వరకూ మరో 70 కిలోమీటర్ల మేర విస్తరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రంపచోడవరం, నర్సీపట్నం, పాడేరు, అరకులోయ, విజయనగరం ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. అలాగే ఏజెన్సీ ప్రాంతాల నుంచి మధురపూడిలోని రాజమహేంద్రవరం విమానాశ్రయానికి రాకపోకల్లో ఇబ్బందులు తొలగనున్నాయి.

ప్రమాదకర మలుపుల తొలగింపు

రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం, నర్సీపట్నం, పాడేరు, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ప్రాంతాలకు నిత్యం వేలాదిగా వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రహదారి గుంతలు, గతుకులు, వంపులు, ప్రమాదకర మలుపులతో ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రాజానగరం, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో 5 ప్రమాదకర మలుపులు ఉండేవి. ప్రధానంగా బూరుగుపూడి, గుమ్మళ్లదొడ్డి, గోకవరం మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరిగేవి. పదేళ్ల కాలంలో ఈ మలుపుల వద్ద 60కి పైగా రోడ్డు ప్రమాదాలు జరగగా.. 10 మందికి పైనే ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఇటువంటి ప్రమాదకర మలుపులన్నింటినీ తొలగించారు.

జిల్లాలో రూ.40 కోట్లతో..

కొంతమూరు వద్ద ప్రారంభమవుతున్న ఈ జాతీయ రహదారి కోలమూరు, గాడాల, రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు మీదుగా జగ్గంపేట నియోజకవర్గం గోకవరం వరకూ మన జిల్లా పరిధిలో ఉంది. కొంతమూరు నుంచి గోకవరం వరకూ 10 మీటర్ల వెడల్పు, రెండు లేయర్ల బ్లాక్ టాప్(బీటీ)తో రూ.40 కోట్ల వ్యయంతో రహదారిని పటిష్టంగా రూపొందించారు. 20 కల్వర్టులు, 2 మైనర్ బ్రిడ్జిలు నిర్మించారు. ఈ రహదారిలో 5 ప్రమాదకరమైన మలుపులను, ఎత్తుపల్లాలను తొలగించారు. నాణ్యతకు పెద్ద పీట వేస్తూ 50 ఎంఎం డీబీఎం (డెన్స్ గ్రేడెడ్ బిట్యుమినియస్ మెకాడమ్), 40 ఎంఎం బీసీ (బిట్యుమినియస్ కాంక్రీట్) వినియోగించారు. దీంతో ఈ రోడ్డు ప్రస్తుతం నూతన రూపు సంతరించుకుంది.



సుందరంగా రూపుదిద్దుకున్న రహదారి

నాణ్యతకు పెద్దపీట



ఈ రహదారి నిర్మాణంపై ప్రజల్లో కొన్నేళ్ల నుంచి ఎక్కువగా డిమాండ్ ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇది కార్యరూపం దాల్చింది. ఈ రోడ్డుపై ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. వాటి నివారణకు అవసరమైన చోట కల్వర్టులు, మైనర్ వంతెనలు నిర్మిస్తున్నారు. ఈ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, రాజానగరం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

అధునాతన పద్ధతుల్లో..

రోడ్డు నిర్మాణాల్లో ప్రభుత్వం నూతన ఒరవడి తీసుకువచ్చింది. నిర్మాణాల్లో కచ్చితంగా 50 ఎంఎం డీబీఎం, 40 ఎంఎం బీసీ పద్ధతి పాటించాలని ఆదేశించింది. తద్వారా ఈ రహదారిని పూర్తి నాణ్యతా ప్రమాణాలతో, నిబంధనలకు అనుగుణంగా నిర్మిస్తున్నాం.

– ఎస్.శ్రీనివాసరావు, జేఈ, జాతీయ రహదారుల శాఖ

క్లుప్తంగా

సెంట్రల్ జైలు ఖైదీ ఆత్మహత్య

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పోక్సో కేసులో శనివారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకి వచ్చిన ఖైదీ ఆదివారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. దీనికి సంబంధించి జైలు సూపరింటెండెంట్ ఎస్.రాజారావు తెలిపిన వివరాల ప్రకారం....పోక్సో కేసులో విజయవాడ నుంచి నున్న అశోక్‌కుమార్ (21) అనే యువకుడు రిమాండ్ నిమిత్తం సెంట్రల్ జైలుకి వచ్చాడు. జైలుకి వచ్చిన మర్నాడు బాత్‌రూమ్‌కు వెళ్లి వెంట ఉన్న టవల్‌తో కిటీకికీ ఉరి వేసుకుని మృతిచెంది ఉన్నాడు. దీనిపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో జైలు అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


మహాలక్ష్మి (ఫైల్)

మామిడికుదురు: మామిడికుదురుకు చెందిన శతాధిక వృద్ధురాలు వాసంశెట్టి మహాలక్ష్మి (101) ఆదివారం మృతిచెందారు. మహాలక్ష్మి అయిదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారని బంధువులు తెలిపారు. ఐదు తరాలకు చెందిన 11 మంది మనుమలు 15 మంది మనుమరాళ్లు 27 మంది ముని మనవలు 24 మంది మునిమనవరాళ్లు ఉన్నారు. ఆమె మృతి పట్ల గ్రామంలో పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

యాజమాన్య పద్ధతులతో కోకోలో లాభాలు

అంబాజీపేట: యాజమాన్య పద్ధతులు పాటిస్తే కోకో పంట లాభాలు తెచ్చిపెడుతుంది. కోకో (థియోబ్రోమా కోకోవా) మాల్వేసి కుటుంబానికి చెందినది. దీనికిగల ప్రత్యేకమైన రుచి, సువాసన, ఔషధ గుణాల వలన దీనిని దేవతల ఆహారంగా పిలుస్తారు. ఉభయ గోదావరి జిల్లాల కొబ్బరి తోటల్లో కోకోను అత్యంత లాభదాయకమైన అంతర పంటగా గుర్తించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.బి.వి.చలపతిరావు రైతులకు సూచించారు.

బెరడు తొలుచు పురుగు

కోకో పంటలో బెరడు తొలుచు పురుగు తీవ్ర స్థాయిలో ఉండటాన్ని గుర్తించారు. తల్లి పురుగులు ఏప్రిల్, మే, జూలై నెలలో కోశస్థ దశ నుంచి బయటకు వచ్చి బెరడు వదులుగా ఉన్న ప్రదేశాలలో గుడ్లు పెడతాయి. పగటి పూట కాండంలో ఉంటూ రాత్రి సమయంలో గొంగళి పురుగులు విసర్జించిన పదార్థాలతో తయారైన గొట్టం ఆకారంలో ఉన్న దారి ద్వారా బయటకు వచ్చి బెరడును తింటాయి. ఈ పురుగు ఆశించడం వల్ల బెరుడు కోల్పోయి, పుష్పాలు రాక పిందెలు ఏర్పడవు. విసర్జించిన పదార్థాలతో నిండిన దారిని శుభ్రపరచాలి. పురుగు ప్రవేశించిన రంధ్రాలలో లామిడాసైల్‌త్రిన్ 0.5 మిలీలీటర్లు లేదా క్లొరంట్రనిఫోల్ 18.5 ఎస్.సి.0.3 మిల్లీలీటర్ల నీటికి కలిపిన ద్రాణం ఆ రంధ్రాలలోకి పంపించి మట్టితో పూడ్చాలి.

ఎలుకలు, ఉడతలు

ఇవి రెండూ కాయలను అధికంగా నష్టపరుస్తాయి. ఎలుకలు ఎక్కువగా కాయల తొడిమ దగ్గర తిని రంధ్రాలు చేస్తాయి. ఉడతలు పక్వానికి వచ్చిన కాయ మధ్య భాగంలో తిని రంధ్రాలు చేసి లోపల గుజ్జును తిని నష్టపరుస్తాయి. ఎలుకలను నివారించడానికి 10 గ్రాముల బ్రొమోడయాలిన్ కేకరులను (0.05శాతం) కోకో చెట్టు కొమ్మలలో 10–12 రోజుల వ్యవధిలో రెండు సార్లు ఉంచాలి. వైర్‌మెష్ బోనులతో కొబ్బరి ముక్కలను ఎరగా వాడి ఉడతలను పట్టుకొని పక్వానికి వచ్చిన కోకో పంట నష్టాన్ని నివారించవచ్చు.


గజ్జి తెగులు సోకిన కోకో చెట్టు

పాడి-పంట

బొట్రియో డిప్లాడియా కాయకుళ్లు/చార్‌కోల్

ఈ తెగులు పొడి వాతావరణంలో తరచుగా ఆశిస్తుంది. కాయలపై లేతపసుపు రంగోలు మచ్చలు ఏర్పడి, పెరిగి పెద్దవై చాకెలేట్ గోధుమ రంగులోకి మారతాయి. ఈ తెగులు కాడదగ్గర మొదలై కాయ కొన భాగానికి పాకుతుంది. కొన్ని సందర్భాల్లో కాయ అంతా నల్లగా మారి శిలీంధ్ర బీజాలపై జిగురు వంటి పొరను ఏర్పరుస్తుంది. తెగులు సోకిన కాయలు రూపం మారి, మొక్కపై అతుక్కుని ఉంటాయి. లేత కొమ్మలపై ఈ తెగులు ఆశించి తల మాడు తెగులును కలిగిస్తుంది. గామాలపై ఆశించే శిలీంధ్రం కావడం వల్ల ఒక శాతం బోర్డో మిశ్రమం, క్రిమి సంహారక రసాయనంతో కలిపి పిచికారీ చేయాలి.

గజ్జి తెగులు

గజ్జి తెగులును స్టెమ్ కాంకర్ అని కూడా అంటారు. ఈ తెగులు ప్రధాన కాండం మీద, జార్కెట్, ఫాన్ కొమ్మల మీద కనిపిస్తుంది. ముందుగా కాండం మీద నీటితో తడిసినట్టుండే మచ్చలు ఏర్పడి ఆ మచ్చల నుంచి ఎర్ర గోధుమ వర్ణపు జిగటకారి తరువాత ఆ పదార్థం ఎండిపోయి తుప్పులా కనిపిస్తుంది. తోటలో మురుగునీరు పోయే సౌకర్యం కల్పించాలి. తెగులు సోకిన కాయలన్నింటిని తొలగించి, కాల్చివేయాలి. తెగులు సోకిన కణజాలం, బెరడును గీకి వేసి ఒక శాతం బోర్డు పేస్టును పూతలా పూయాలి. తెగులు ఉధృతి అధకంగా ఉంటే కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 మిల్లీలీటర్ల నీటిలో కలిపి ప్రతీ చెట్టు పళ్లెంలోని మట్టిలో కలపాలి.

ఎరువుల యాజమాన్యం



కోకో మొక్కలకు ఎరువులు అందించడం వలన మొక్కలు ధృఢంగా పెరిగి మంచి దిగుబడిని అందించడానికి తోడ్పడుతుంది. సాధారణంగా నాటిన 3 సంవత్సరాల నుంచి ప్రతి చెట్టుకు 125 గ్రాముల నత్రజని (250 గ్రా. యూరియా), 40 గ్రాముల భాస్వరం (250 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్), 140 గ్రాములు పొటాషియం (250 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్) సిఫారసు చేస్తారు. నాటిన మొదటి ఏడాది పైన వివరించిన మోతాదులో 33 శాతం, రెండో ఏడాది 66 శాతం వేయాలి. ఈ రసాయనిక ఎరువులను కలిపి చెట్టు మొదలు నుంచి 75 సెంటీమీటర్ల దూరం వరకు చుట్టూ చల్లి మట్టితో కలియబెట్టాలి. జింకు లోపాన్ని నివారించడానికి జింకు సల్ఫేటు (0.3 శాతం) + సున్నం (0.15 శాతం) మిశ్రమం ఆకుల మీద పిచికారీ చేయాలి. ఇనుము ధాతు లోపాన్ని నివారించడానికి ఆకుల మీద అన్నభేది (1 శాతం), నిమ్మ ఉప్పు (1 గ్రా. / లీ.) ని పిచికారీ చేయడం వలన ఈ ధాతు లోపాన్ని నివారించవచ్చు.

– డాక్టర్ బి.శ్రీనివాసులు, అధిపతి, ఉద్యాన పరిశోధన కేంద్రం, అంబాజీపేట

వేడి ప్రసాదం తొట్టిలో పడిన ప్యాకర్

- రత్నగిరిపై సత్యదేవుని ప్రసాదం తయారీ విభాగంలో ఘటన
- విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందన్న వైద్యులు


గాయపడిన ప్యాకర్ సత్యనారాయణ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రసాదం తయారీ విభాగంలో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ప్రసాదం ప్యాకర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్వామివారి ప్రసాదం తయారు అయిన తరువాత దానిని కళాయి నుంచి తొట్టిలోకి ఒంపే ప్రయత్నంలో ప్రసాదం ప్యాకర్ పోల్నాటి సత్యనారాయణ కాలు జారి ఆ తొట్టిలో పడిపోయాడు. వెంటనే పక్కనున్న ఇతర ప్యాకర్లు అతనిని పైకి లేపారు. అప్పటికే కుడిచెయ్యి భుజం వరకు వేడి ప్రసాదం తగిలి గాయాలయ్యాయి. వెంటనే అతడిని కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యం చేసి ఇంటికి పంపించేశారు. మందులు వాడుతూ ఇంటి వద్ద పది రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు తెలిపారని సంబంధిత విభాగ అధికారులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- ఉమ్మడి జిల్లాలో 150 కేంద్రాలు
- నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు
- ఆర్జేడీ శారద ఆదేశాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా (కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, ఏఎస్ఆర్)లో ఈ నెల 15 నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఇంటర్ విద్య జోన్ 1,2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద తెలిపారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై ఆర్ఐవోలు, వృత్తివిద్యాశాఖాధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ పరీక్షల్లో అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉమ్మడి జిల్లాలో 140 కేంద్రాల్లో ఈ పరీక్షలు వచ్చే నెల నాలుగో తేదీ వరకు జరుగుతాయన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 47 కేంద్రాల్లో 26,931 మంది కాకినాడ జిల్లాలో 60 కేంద్రాల్లో 41,817 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 38 కేంద్రాల్లో 28,973 మంది, ఏఎస్ఆర్ జిల్లాలో 10 కేంద్రాల్లో 4,922 మంది మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 1,02,643 మంది ఈ పరీక్షలకు హాజరవుతారన్నారు. 140 కేంద్రాలకు సీఎస్, డీఎస్‌ల నిమాయకం పూర్తయిందన్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఒక నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతి లేదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 10 సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. విద్యార్థులు పరీక్షకు గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలన్నారు.


మాట్లాడుతున్న రీజినల్ జాయింట్ డైరెక్టర్ శారద

హాల్ టిక్కెట్ ఇవ్వకపోతే కళాశాలపై చర్యలు

ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని కళాశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వాలన్నారు. ఫీజు సాకు చెబుతూ ఇబ్బందులకు గురిచేసినట్లు తమ దృష్టికి వస్తే ఆ కళాశాలపై చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐవో ఎస్ఎస్ఎల్‌వీ నరసింహం, డీవీఈవోలు, హెచ్‌పీసీ, డీఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

లోకేష్‌కు లోకజ్ఞానమే లేదు

- ఇక రాజకీయ పరిజ్ఞానం ఎక్కడిది?
- పెద్దాయన పెద్దిరెడ్డిని అనే అర్హత లేదు
- నిజంగా దమ్ముంటే మిథున్‌రెడ్డి చాలెంజ్ స్వీకరించాలి
- రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: లోకేష్‌కు అసలు ఏమాత్రం లోకజ్ఞానం, రాజకీయ పరిజ్ఞానం లేవని, అందువల్లనే చంద్రబాబు ఆయన దత్త పుత్రుడిని ఆశ్రయించాల్సి వస్తోందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ రియల్ హీరో అని, ఆయనను విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదని అన్నారు. చిత్తూరు జిల్లాలో లోకేష్ అయోమయ గళం పేరుతో పర్యటిస్తున్నారు. ఆ జిల్లాయే మీ నాయనది. అయినా పట్టు లేదు. అదే జిల్లాకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అంటే అక్కడి ప్రజలకు పెద్ద భరోసా. అభివృద్ధి చేశారు కాబట్టే ఆయనంటే గౌరవం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేసినా చిత్తూరు జిల్లాలో ఏ విలువా లేదు. లోకేష్‌కే గనుక చిత్తూరు జిల్లా డీఎన్ఏ ఉంటే ఆ జిల్లాలో ఎక్కడి నుంచైనా తనతో పోటీ చేయాలంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సవాల్ విసిరారు. దానిని స్వీకరించే దమ్మూ, ధైర్యం లోకేష్‌కు ఉన్నాయా? అని ఎంపీ భరత్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలందరి హృదయాలను గెలుచుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ సింహమేనని, రియల్ హీరోయేనని అన్నారు. రాష్ట్రం స్వార్థ శక్తుల చేతుల్లోకి పోకుండా కాపాడేందుకు సీఎం జగన్ తగిన అడుగులు వేస్తున్నారని చెప్పారు.

బీసీలు, కాపులు కలిస్తే రాజ్యాధికారం సాధించవచ్చన్న పవన్ కల్యాణ్ మాటలపై ఎంపీ భరత్ స్పందించారు. ఇవి సినిమా డైలాగులకు పనిచేస్తాయని, ఆచరణలో చూపించలేరని, చంద్రబాబు హయాంలో ఈ విషయం నిర్ధారణ అయిందని చెప్పారు. పవన్ కల్యాణ్ తన పక్కన ఎవరినైనా బీసీలను కూర్చోబెట్టుకుంటున్నారా అని ప్రశ్నించారు. నాదెండ్ల మనోహర్, నాగబాబు ఎప్పుడైనా బీసీలను చూశారా అని నిలదీశారు. ఎప్పుడూ లేనిది.. బీసీలపై ఈ కల్లబొల్లి ప్రేమ దేనికని అన్నారు.

నెత్తిన విగ్గూ, చేతిలో పెగ్గూ ఉంటేనే కానీ నోట్లోంచి మాటలు రాని అరిటాకు, బఫూన్ నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు అని భరత్‌రామ్ తీవ్రంగా మండిపడ్డారు. మహాభారతంలోని శిఖండి వంటివాడని అన్నారు. తనసుద్దేశించి ఆయన ఏవేవో వాగుతున్నాడని, ఆయన గురించి ఎక్కువ మాట్లాడి తన సమయాన్ని వృథా చేసుకోనని చెప్పారు. వ్యక్తిత్వాన్ని బట్టి గౌరవం వస్తుందని, రఘురామకు అటువంటి వ్యక్తిత్వం లేదని, నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే చెబుతారని దుయ్యబట్టారు. ఢిల్లీ దాటి బయటకు రాలేరని, ఇద్దరు ముగ్గురు మీడియా వాళ్లను కూర్చోబెట్టుకుని ఏదేదో వాగడం తప్పితే, తమలా ధైర్యంగా బయటకు, ఆయన నియోజకవర్గానికి, కనీసం ఏపీకి, హైదరాబాద్‌కు రాలేరని, ఆయనో అజ్ఞాతవాసి అని విమర్శించారు. ఏదైనా సినిమాలో బఫూన్‌గా నటిస్తే డబ్బులైనా వస్తాయని వ్యంగ్యంగా అన్నారు. కావాలంటే తాను పది సినిమాల్లో హీరోగా నటించగలనని, రఘురామ బఫూన్ వేషాలకు మాత్రమే పనికివస్తారని, పెద్దగా మేకప్ కూడా అక్కర్లేదని అన్నారు. వైఎస్సార్ సీపీ 13వ వసంతంలోకి అడుగు పెట్టిన వేళ.. పార్టీ పటిష్టతకు, ప్రతిష్టను కాపాడేందుకు నిస్వార్థంగా అంకితమైన ప్రతి ఒక్కరికీ ఎంపీ భరత్ కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.


విలేకర్లతో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

వాడపల్లి వెంకన్నకు భక్తుల విరాళాలు


దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి పలువురు భక్తులు విరాళాలు అందించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆదివారం తెలిపారు. పాలకోడేరు మండలం గొల్లకోడేరుకు చెందిన గాదిరాజు వెంకటరాజు రూ.50 వేలు, అనపర్తికి చెందిన కోటపల్లి వెంకటరావు రూ.50 వేలు, యానాంకు చెందిన ఇ.ఫణీంద్ర సత్యసాయి హేమంత్ పర్వేశ్ రూ.20,001, హైదరాబాద్‌కు చెందిన జి.వేణుగోపాల్, ఉమాదేవి రూ.10,116 విరాళం అందించినట్లు తెలిపారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందించారు.

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కపిలేశ్వరపురం: మాచర గ్రామానికి చెందిన గీత కార్మికుడు పిల్లి సూరిబాబు కల్లు గీస్తుండగా చెట్టుపై నుంచి జారిపడి గాయాల పాలయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... సూరిబాబు శనివారం సాయంత్రం గోదావరి లంకలో కల్లు గీసేందుకు చెట్టు ఎక్కాడు. జారిపడటంతో వెన్నుకు గాయమైందని, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు.

క్రైం కార్నర్..

యువకుడి అదృశ్యం


ప్రేమ్‌కుమార్

మండపేట: మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యంపై ఆదివారం రాత్రి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కాజులూరు మండలం దుగ్గుదూరుకు చెందిన కోళ్ల ప్రేమ్‌కుమార్ ఈనెల 9వ తేదీన మండపేటలో బంధువుల ఇంటికి వచ్చాడు. సాయంత్రం ఇంటి వద్ద నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మూడు రోజులైనా ఇంటికి తిరిగిరాకపోవడంపై తండ్రి ఇజ్రాయేల్ ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కె.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాగి వైరు దొంగల అరెస్టు

అనపర్తి: రాగివైరు చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అనపర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 41 కేజీల రాగివైరును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నియోజకవర్గంలోని అనపర్తి, రంగంపేట, బిక్కవోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో రాగి వైరు చోరీలకు పాల్పడుతున్న ఘటనలపై అందిన ఫిర్యాదులు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం అనపర్తి సీఐ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ పి. అప్పారావు కెనాల్ రోడ్డులోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో బిక్కవోలు మండలం కాపవరానికి చెందిన వరసల నాగరాజు, ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన కర్రి శ్రీనివాసరెడ్డి, రాయవరం మండలం మాచవరానికి చెందిన పడాల రాజారెడ్డిలను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రాగివైరును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి చోరీ సొత్తు కొనుగోలు చేసిన బిక్కవోలుకు చెందిన ఇద్దరు, అనపర్తికి చెందిన ఒక వ్యాపారిపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొత్తపల్లి: ఉప్పాడ–కోనపాపపేట బీచ్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయని ఆదివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మూలపేట ప్రకాష్ నగర్‌కు చెందిన వై.రాంబాబు, ఓసుపల్లి చిన్నతో పాటు మరి కొంత మంది శనివారం రాత్రి సుముద్రంపై వేటకు వెళ్లేందుకు సామగ్రితో ఆటోలో ఉప్పాడ–కోనపాపపేట బీచ్‌రోడ్డులో కాకినాడ వైపు వెళుతుండగా రామున్నపాలెం సమీపంలోని బీచ్‌రోడ్డులో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో వెనుక కూర్చొన్న రాంబాబు, చిన్నాలకు గాయాలు కాగా చికిత్స కోసం వారిని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వైద్యులే కనిపించే దేవుళ్లు

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా


మల్టీపర్పస్ ఆడిటోరియంలను ప్రారంభిస్తున్న గోపీచంద్. చిత్రంలో ఎమ్మెల్యే రాజా తదితరులు

రాజానగరం: సమాజంలో రుగ్మతలతో సతమతమయ్యే వారికి భయం లేదనే భరోసానందిస్తూ ఆత్మస్థైర్యాన్నందించే వైద్యులే కనిపించే దేవుళ్లని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో ఆదివారం జరిగిన స్నాతకోత్సవంలో 2017 బ్యాచ్‌కి చెందిన వైద్య విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. సభలో ఆయన మాట్లాడుతూ తాను కూడా ఇదే కళాశాల నుంచి మెడిసిన్ చేయవలసి ఉందని, కానీ కుటుంబ పరిస్థితులు, వ్యక్తిగత కారణాలతో పూర్తి చేయలేకపోయాననే బాధ ఇటువంటి సమయాలలో కలుగుతుందన్నారు. అయితే ఈ రోజు మెడిసిన్ పూర్తి చేసిన విద్యార్థులకు ఈ విధంగా డిగ్రీ పట్టాలు అందించే అవకాశం లభించడం జీవితంలో మరువలేని మధురమైన ఘట్టంగా నిలిచిపోతుందన్నారు. మానవ సేవయే మాధవ సేవ అనే పదానికి నిజమైన అర్థం ఇచ్చే వృత్తి.. వైద్యం అని, ఆ వృత్తిని చేపట్టిన మీరంతా అంకిత భావంతో పనిచేస్తూ, మానవుల్లో మాధవుల్లా సేవలందించాలన్నారు. కోవిడ్ వైరస్ సమయంలో వైద్యులు అందించిన సేవలు అనిర్వచనీయమైనవన్నారు.

లక్ష్య సాధనే అసలైన విజయం

నిర్ణయించుకున్న లక్ష్యాలను సాధించడం, సొంత గమ్యాలకు చేరుకోవడం మీద దృష్టినిపెట్టి చేరుకోవడమే అసలైన విజయమని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. వైద్య విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోపీచంద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం జీఎస్ఎల్ వైద్య కళాశాల క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ ఇండోర్, మల్టీపర్పస్ ఆడిటోరియంలను ఆయన ప్రారంభించారు. కాలేజీలో 15వ బ్యాచ్ (2017)లో 196 మంది ఎంబీబీఎస్ పరీక్షలు రాయగా వారిలో 71 మంది ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ గురునాథ్ తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, కార్డియోథొరాసిక్ సర్జన్ (బెంగళూరు) డాక్టర్ ధన్యప్రకాష్, సినీ నటుడు వి.నాగినీడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పందేలు

- రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న 37 జతల ఎడ్లు

పిఠాపురం: నువ్వా నేనా అంటూ గెలుపే లక్ష్యంగా ఎడ్ల బండ్లు దూసుకు పోతుంటే.. పరుగో పరుగు అంటూ రైతుల నినాదాల మధ్య గొల్లప్రోలు మండలం కొడవలిలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందేలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. గ్రామ దేవత ఇందేశమ్మ జాతర సందర్భంగా స్థానిక ఎడ్ల బండ్ల సంఘం ఆధ్వర్యంలో రైతుల సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో 37 జతల ఎడ్లు పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో మొదటి, ద్వితీయ బహుమతులు గుమ్మిలేరుకు చెందిన కోరా శృతి చౌదరి, మూడో బహుమతి సామర్లకోటకు చెందిన వల్లూరి సత్యేంద్రకుమార్‌కు చెందిన ఎడ్ల జతలు గెలుచుకున్నాయి. జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి పిఠాపురం మండలం వెల్దుర్తికి చెందిన మొగలి ఏసుబాబు, రెండో బహుమతి వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి, మూడో బహుమతి ధర్మవరానికి చెందిన దొడ్డిపట్ల రామ గీతికా లక్ష్మణ గోకుల, నాలుగో బహుమతి జమ్మిగొల్లేపల్లికి చెందిన నలజాల నరసింహారావు మెమోరియల్‌కు చెందిన ఎడ్ల జతలు గెలుచుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే పెండెం దొరబాబులు బహుమతులు అందజేశారు. పోటీలను కాకినాడ జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు ఉత్సాహంగా తిలకించారు. జెడ్పీటీసీ సభ్యుడు వులవకాయల నాగ లోవరాజు, సర్పంచ్ బుర్రా రామచంద్ర, ఎంపీటీసీ సభ్యుడు భగవాన్, మాజీ సర్పంచ్ ముప్పనబోయిన సోమరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, కడింశెట్టి భాస్కరరెడ్డి పాల్గొనగా న్యాయ నిర్ణేతలుగా సిద్దా నానాజీ, యనమల కృష్ణ, చేకూరి రామకృష్ణ వ్యవహరించారు.


పందెంలో గెలుపు కోసం పరుగుతీస్తున్న ఎడ్ల బండి


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు